# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 30-10-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో మొంథా తుపాను కారణంగా జరిగిన పంట నష్టం వివరాలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు.**
2. **మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ఆదేశించారు.**
3. **ఆంధ్రప్రదేశ్‌లో తుపాను ప్రభావిత గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.**
4. **తుపాను బాధిత కుటుంబాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అండగా ఉంటుందని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు.**
5. **ప్రముఖ అణు శాస్త్రవేత్త, పద్మభూషణ్ హోమీ జహంగీర్ బాబా జయంతి ఈరోజు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో మొంథా తుపాను కారణంగా జరిగిన పంట నష్టం వివరాలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. తుపాను వల్ల సంభవించిన నష్టంపైన, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపైనా అధికారులతో అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి గత సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, వ్యవసాయ శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించి, వాటిని కాపాడేందుకు గల అవకాశాలపై రైతులకు తగు సూచనలు చేయాలని ఆదేశించారు. అంతకుముందు మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విహంగ వీక్షణం ద్వారా ముఖ్యమంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్..32 సెకన్లు

--------------------------

తుపాను ప్రభావిత గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. మొంథా తుపాను అనంతరం తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి గత సాయంత్రం దృశ్య మాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తుపాను ప్రభావంతో రహదారులకు ప్రాధాన్య క్రమంలో పునరుద్ధరణ పనులు చేపట్టాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య సిబ్బందిని బృందాలుగా ఏర్పాటు చేసి,

పారిశుధ్య మెరుగుదలకు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నీరు కలుషితం కాకుండా, వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

---------------------------

మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మొంథా తుపానుపై ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీచేశారు. పలు చోట్ల కల్లాల్లో ధాన్యం ఆరబోసిన నేపథ్యంలో.. ఎటువంటి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వివిధ స్టేషన్లలో రైళ్లు నిలిచిపోవడం, కొన్ని దారి మళ్లించిన నేపథ్యంలో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆకస్మిక వరదలతో వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున.. జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సహాయక శిబిరాలకు తరలించాలని ముఖ్యమంత్రి తెలిపారు.

---------------------------

తుపాను ప్రభావిత కుటుంబాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అండగా ఉంటుందని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది మండలంలో మొంథా తుపాను ప్రభావిత పల్లెపాలెం గ్రామంలో పునరావాస కేంద్రాన్ని మంత్రి నిన్న పరిశీలించారు. నిర్వాసితులతో మాట్లాడి వారి అవసరాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దుప్పట్లు, మందులు, అవసరమైన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్, తాగునీరు, వైద్య సేవలు త్వరితగతిన పునరుద్ధరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. స్థానిక మత్స్యకార కుటుంబాలతో మాట్లాడి వారి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అధికారులను ఆదేశించారు.

---------------------------

అమరావతికి భూములిచ్చిన రైతులకు రాబోయే నాలుగు నెలల్లో ప్లాట్‌ల కేటాయింపు, రిజిస్ట్రేషన్‌లు మొత్తం పూర్తి చేస్తామని ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, అమరావతి నిర్మాణం విషయంలో ప్రణాళికతో ముందుకెళ్తున్నామని అన్నారు. రైతులకు ప్లాట్‌ల కేటాయింపుపై కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని, ప్లాట్ ల కేటాయింపు, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ దాదాపు తుది దశకు చేరుకుందని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై ఏర్పాటైన మంత్రుల బృందం నిన్న రాష్ట్ర సచివాలయంలో సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, పి. నారాయణ, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్, వి. అనిత, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ, జిల్లాల విభజన వల్ల ఏర్పడిన సమస్యలపై చర్చించామన్నారు. పరిపాలనా సౌలభ్యం ఉండేలా మండలాలు, పంచాతీయలు విభజన ఉండాలని నిర్ణయించామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ .. 28 సెకన్లు

---------------------------

భారత ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని యువతలో ఐక్యత, దేశభక్తి భావాన్ని పెంపొందించే లక్ష్యంతో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా నిర్వహించే ప్రత్యేక ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఐక్యతా పరుగు, యోగా, ఆరోగ్య శిబిరాలు వంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గుజరాత్‌లోని ఏక్తా నగర్‌లో జరగనున్న రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకలపై బీహార్‌లోని పాట్నాలో ఈరోజు నిర్వహించే కర్టెన్ రైజర్ కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రసంగిస్తారు.

---------------------------

ప్రముఖ అణు శాస్త్రవేత్త, పద్మభూషణ్ హోమీ జహంగీర్ బాబా జయంతి ఈరోజు. భారత అణు కార్యక్రమ పితామహుడు, టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్ సెంటర్, ఎటామిక్ ఎనర్జీ ఎస్టాబ్లిష్‌మెంట్ వ్యవస్థాపకులు, ఎటామిక్ ఎనర్జీ రంగంలో విశేష సేవలందించిన హోమీ జహంగీర్ బాబా 1909 అక్టోబర్ 30వ తేదీన ముంబైలో జన్మించారు. అణుశక్తి రంగంలో ఆయన చేసిన విశేష కృషిని స్మరించుకుంటూ జాతి యావత్తు ఆయనకు ఈరోజు ఘనంగా నివాళులర్పిస్తోంది.

---------------------------

భారీ వర్షాలతో తెలంగాణలో జనజీవనానికి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. తుపాను ప్రభావం, చర్యలపై హైదరాబాద్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. వర్షాల వల్ల ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వంతెనలు, కల్వర్టుల వద్ద ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తుపాను ప్రభావంతో తెలంగాణలోని వరంగల్, హనుమకొండ, జనగామ, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో విద్యాసంస్థలకి ఈరోజు సెలవులు ప్రకటించారు. అలాగే భువనగిరి, సిద్దిపేట, కరీంనగర్ తదితర జిల్లాల్లో పాఠశాలలకు సెలవు ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు.

---------------------------

'మొంథా' తుపాను వాయుగుండంగా బలహీనపడిందని ఇది ఉత్తర వాయవ్య దిశగా కదిలి క్రమంగా బలహీనపడనుందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎం. వెంకట్రావు తెలియజేస్తూ,

వాయిస్ 20 సెకన్లు

తెలంగాణ భూభాగంపై 'మొంథా' తుపాను ప్రభావం కొనసాగుతోందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట జిల్లాల్లో అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని ఈ మేరకు ఆరు జిల్లాలకు రెడ్ ఎలర్ట్ ప్రకటించింది. ఒకట్రెండు ప్రాంతాలలో ఆకస్మిక వరదలు సంభవించే అవకాశం ఉందని తెలిపింది.

---------------------------

తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలు వేడి చేసిన లేదా క్లోరిన్ కలిపిన నీటిని మాత్రమే తాగాలని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు. ‘విరిగిన విద్యుత్తు స్తంభాలు, వదులుగా ఉండే తీగలు, తెగిన తీగలు, ఇతర పదునైన వస్తువుల విషయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. దెబ్బతిన్న, కూలిపోయిన భవనాల్లోకి ప్రవేశించవద్దని కోరారు. విద్యుత్తు పరికరాలు, వస్తువుల్ని వాడే ముందు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తూ ఈ మేరకు ఒక ప్రకటనను విడుదల చేశారు.

======================